క్లుప్తంగా

కస్తూర్బా విద్యార్థినులకు కంటి పరీక్షలు



విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

భీమునిపట్నం: భీమిలిలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినులకు గురువారం కంటి పరీక్షలు చేశారు. విశాఖ ఐ బ్యాంక్ రీసెర్చ్ ట్రెనింగ్ ట్రస్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్లు సాయి కృష్ణకుమార్, సీహెచ్.వంశీకృష్ణ ఆధ్వర్యంలో వైద్యబృందం 270 మందికి కంటి పరీక్షలు నిర్వహించింది. వీరిలో 16 మందికి కంటి అద్దాలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న బీఎల్‌వో

భీమునిపట్నం: స్థానిక మూడో వార్డులోని 173 పోలింగ్ బూత్ పరిధిలో గురువారం బీఎల్‌వో సాగర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించారు. జాబితా ప్రకారం ఓటర్లు సరిగ్గా ఉన్నారా, లేదా అని తనిఖీ చేశారు. మార్పులు, చేర్పులు చేశారు. కార్యక్రమంలో అప్పికొండ వీధి సచివాలయ కన్వీనర్ రాంభక్త దేవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎర్రించి అచ్చిబాబు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



చంద్రంపాలెం హైస్కూల్లో పేరెంట్స్ మీటింగ్‌లో మాట్లాడుతున్న హెచ్‌ఎం రాజబాబు

మధురవాడ : విద్యాభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతోందని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజబాబు చెప్పారు. గురువారం మధురవాడ పరిధిలోని చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వాంబేకాలనీ, సుశీల్‌శర్మ కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు ఇతర పాఠశాలల్లో కూడా తల్లి దండ్రుల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరీక్షల్లో విద్యార్థుల మార్కులు, ఉన్నతి ఉపాధ్యాయులు వారికి వివరించారు. మరింత మంచి రిజల్ట్ సాధించేందుకు తల్లిదండ్రులు కూడా పిల్లలకు దిశా నిర్దేశం చేయాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాశ్వత భూహక్కు పత్రాల పంపిణీ నేడు

పద్మనాభం : మండలంలోని బుడ్డివలస-అగ్రహారంలో శుక్రవారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద యాజమాన్య ఆస్తి ధ్రువపత్రాలు పంపిణీ చేయనున్నట్టు ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు లబ్ధిదారులకు భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఈ పత్రాలు పంపిణీ చేయనున్నారని ఆయన తెలిపారు.

17 నుంచి శృంగేరి శంకర మఠంలో శ్రావణ ఉత్సవాలు

పీఎం పాలెం: శ్రీ శృంగేరి శంకరమఠంలో ఈ నెల 17వ తేదీ నుంచి శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం అవుతాయని మఠం గౌరవ ధర్మాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. మఠంలోని శ్రీ శారదా పరమేశ్వరి, శ్రీ ఉమాదేవి అమ్మవార్లకు నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు జరుగుతాయని తెలియజేశారు. శ్రావణ శుక్రవారాల్లో వరలక్ష్మీ వ్రతాలు, విశేష పంచామృత అభిషేకాలు ఉంటాయని పేర్కొన్నారు.

పుడమి తల్లిని పరిరక్షిద్దాం

- భావితరాలకు సారవంతమైన నేలను అందిద్దాం
- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు
- వాడవాడలా 'నా మట్టి - నా దేశం'



రెడ్డిపల్లిలో మొక్కలు నాటుతున్న వైస్ ఎంపీపీ రాజేశ్వరి



టి.నగరపాలెంలో జాతీయ జెండా ఎగరవేసి ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీవో శ్రీనివాసరావు

తగరపువలస: అందరం ఐక్యతతో పుడమి తల్లిని పరిరక్షించుకుందామని జిల్లా పంచాయతీ అధికారి ఎం.వి. శ్రీనివాసరావు అన్నారు. భావితరాలకు సారవంతమైన నేలను అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలంతా కృషి చేయాలని కోరారు. భీమిలి మండలం టి.నగరపాలెంలో గురువారం నిర్వహించిన 'నా భూమి - నా దేశం' కార్యక్రమంలో భాగంగా ముందుగా సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమిచే జాతీయ జెండాను ఎగరవేయించారు. అనంతరం రైతు భరోసా కేంద్రం వద్ద మొక్కలు నాటించారు. దేశ స్వాతంత్రం కోసం అశువులు బాసిన అమరవీరులకు నివాళులు అర్పించారు. గ్రామస్తుల సాయంతో కలశం ద్వారా మట్టిని సేకరించారు. విద్యార్థులతో జాతీయ గేయం, గీతం పాడించిన అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, ఎంపీవో శివరాణి, ఈవోఆర్డీ అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి శంకర్‌జగన్నాథ్, సచివాలయ కార్యదర్శి లోకేశ్వరి, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు పొట్నూరు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

- మండలంలోని అన్నవరం, నారాయణరాజుపేట, రేఖవానిపాలెం మజ్జివలస, మజ్జిపేట, చిప్పాడ పంచాయతీలలో జరిగిన నా దేశం-నా భూమి కార్యక్రమాలలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పద్మనాభంలోని మూడు పంచాయతీల్లో ..

పద్మనాభం: మండలంలోని మూడు పంచాయతీల్లో గురువారం నాభూమి-నాదేశం కార్యక్రమాలు జరిగాయి. రెడ్డిపల్లిలో వైస్ ఎంపీపీ ఈర్ల రాజేశ్వరి, ఉప సర్పంచ్ సిరుగుడి ఆదినారాయణ, పొట్నూరులో సర్పంచ్ బేపల భవానీ, ఎంపీటీసీ సభ్యురాలు తోనంగి దివ్య, చేరిఖండంలో ఎంపీడీవో ఎం.విజయకుమార్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో వరలక్ష్మి, ఈసీ తులసి పాల్గొన్నారు.

గీతం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో..

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో మధురవాడలోని చంద్రంపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నా మట్టి - నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఎ. శ్రీనివాస్, ప్రోగ్రామర్ ఆర్.గోపీనాథ్, ఎన్ఎస్ఎస్ కన్వీనర్లు ముందుగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలని కోరారు.



రేఖవానిపాలెంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు



చంద్రంపాలెం హైస్కూల్లో మొక్కలు నాటుతున్న గీతం ఎన్ఎస్ఎస్ కన్వీనర్లు

నిబద్ధత కలిగిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి



చంద్రంపాలెంలో నాయకులకు హారతులు పట్టి, పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న మహిళలు

మధురవాడ : పేదల పట్ల నిబద్ధత కలిగిన నాయకుడు మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం జీవీఎంసీ 7వ వార్డు చంద్రంపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే ఈ సంక్షేమ పథకాలు కొనసాగుతాయని అన్నారు. ఈ గ్రామంలో 406 మందికి ఇంటి పట్టాలు వచ్చాయని, ఇంకా ఏమైనా సమస్యలుంటే తక్షణమే పరిష్కారం చేస్తామన్నారు. గ్రామాల అభివృద్ధికి మరిన్ని చర్యలు చేపడతామని అన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి వచ్చిన నాయకులకు మహిళలు హారతులు పట్టారు. స్థానికులు పూర్ణకుంభం, బాణసంచా, డీజే వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు.

పవన్ కల్యాణ్‌కు రాజకీయ జ్ఞానం లేదు

పవన్ కల్యాణ్‌కు సినిమా నాలెడ్జి తప్ప..రాజకీయ నాలెడ్జి లేదని విమర్శించారు. ఎక్కువ మంది మహిళలే వలంటీర్లుగా ఉంటున్నారని, ఈ వార్డు సచివాలయంలోనూ మహిళలే ఉన్నారన్నారు. మహిళలే మహిళలను ఎత్తుకుపోతున్నారా పవన్ కల్యాణ్? అంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేశ్, వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, వార్డు సచివాలయాల ఇన్‌చార్జి కుడితి రామారావు, సింహాచలం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిల్లా సూరిబాబు, పీవీజీ అప్పారావు, పోతిన జోగి, జగ్గుపిల్లి నరేష్, పోతిన పైడిరాజు, రైల్వే బోర్డు సభ్యుడు, ఎన్. బాబ్జి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, సచివాలయ కన్వీనర్లు నాగోతి శాంతి, పిల్లా సన్యాసిరావు, పిల్లా రమణ, జెడ్పీ కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



విద్యార్థులకు నులి పురుగుల మాత్రలు అందిస్తున్న సిబ్బంది



చంద్రపాలెం అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలకు మాత్రలు వేస్తున్న ఏఎన్ఎం



బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో అవగాహన కలిగిస్తున్న ఆరోగ్యసిబ్బంది

పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బండజోల్ మాత్రల పంపిణీ

ఆనందపురం : చిన్నారుల ఆరోగ్యానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఎంపీపీ మజ్జి శారదా ప్రియాంక చెప్పారు. మండలంలోని తర్లువాడ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శారదా ప్రియాంక మాట్లాడుతూ నులి పురుగుల నివారణలో అలసత్వం వహిస్తే పిల్లలు అనారోగ్యానికి గురవుతారని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.గంగునాయుడు మాట్లాడుతూ నులిపురుగుల వలన పిల్లలు అనారోగ్యానికి గురై, బలహీనమవుతారన్నారు. అందుకే నులిపురుగుల నివారణ మాత్రలు తప్పనిసరిగా వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎస్.గంగరాజు, మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, వైద్యురాలు షహనాజ్ సాదియా, సామాజిక ఆరోగ్యాధికారి పి.సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

భీమునిపట్నం: పిల్లల చదువు పట్ల తల్లితండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ సింహాచలం అన్నారు. గురువారం పాఠశాల వద్ద నిర్వహించిన తల్లితండ్రుల సమావేశంలో పాల్గొన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులందరు అన్ని పాఠాలను చక్కగా బోధిస్తున్నారని అన్నారు. దానికి తగిన విధంగా ఇళ్ల వద్ద పిల్లలు జాగ్రత్తగా చదివే విధంగా తల్లిదండ్రులు చూడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు అందించారు. ఉపాధ్యాయులు సుజాతకుమారి, అల్లాడి శ్రీనివాసరావు, వెంకటరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

మధురవాడ పీహెచ్‌సీ పరిధిలో..

మధురవాడ: నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం మధురవాడ పీహెచ్‌సీ పరిధిలోని 14 పాఠశాలలు, ఒక అంగ్‌వాడీ కేంద్రంలో మొత్తం 2822 మంది పిల్లలకు వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ మాత్రలు వేసుకుంటే కడుపులో నులి పురుగులు తొలగిపోతాయని తెలిపారు.

గొల్లలపాలెం ప్రాథమిక పాఠశాలలో..

తగరపువలస : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని భీమిలి ఎంఈవో శివరాణి అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా భీమిలి మండలం గొల్లలపాలెం ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య సిబ్బందిచే విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు అందించారు. ఈ మాత్రలు వేసుకోవడం వల్ల పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత లోపం, నీరసం తగ్గుతాయన్నారు. డీపీవో ఎంవీ శ్రీనివాసరావు, ఎంపీడీవో పి.వెంకటరమణ, సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, ఎంపీటీసీ సభ్యురాలు పల్లా నీలిమ, పొట్నూరు చంద్రశేఖర్, ప్రధానోపాధ్యాయుడు ఈవీ ప్రసాద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రేఖవానిపాలెం ప్రాథమిక పాఠశాలలో మాత్రలు పంపిణీ చేస్తున్న వాసురాజు

- జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో తగరపువలస పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అప్పలరాజు, రమేష్, మల్లిక, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రేఖవానిపాలెం ప్రాథమిక పాఠశాలలో..

తగరపువలస : విద్యార్థుల ఆరోగ్యమే ప్రధానంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లుగా పని చేస్తున్నారని భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు అన్నారు. గురువారం భీమిలి మండలం రేఖవానిపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు ఆరోగ్య సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రతలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, ఆరోగ్య విస్తరణాధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలి బాటలతో వరి పంటకు మేలు

పద్మనాభం : కాలి బాటలు తీయడం వల్ల గాలి, వెలుతురు తగిలి వరి పంటకు మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ శాఖ రీజినల్ అధికారి ప్రకాష్ అన్నారు. మండలంలోని పొట్నూరులో గురువారం రైతులతో సీడ్ టు సీడ్ కాంపాక్ట్ బ్లాక్ తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు పల్లాలు, లింగార్షక బుట్టలు వరి పైరులో పెట్టడం వల్ల పురుగుల ఉధృతిని తెలుసుకోవచ్చన్నారు.

పక్షి స్థావరాలు పెట్టడం వల్ల శత్రు పురుగులను తింటాయన్నారు. వరి పొలాల గట్లపై రక్షక పంట అయిన కంది వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



పొట్నూరులో వరిపైరును పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ రీజినల్ అధికారి ప్రకాష్

మార్కెట్ యార్డు వద్ద వ్యర్థాల గుట్ట



మార్కెట్ యార్డు ముందు భాగంలో వ్యర్థాల గుట్ట

ఆనందపురం : ఆనందపురం జంక్షన్‌లో ఉన్న మార్కెట్ యార్డు ముందు భాగంలో విచ్చలవిడిగా వ్యర్థాలు పడేయడంతో అపారిశుధ్యం నెలకుంది. దీంతో మార్కెట్‌కు వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారు. మార్కెట్ యార్డు ముందు భాగంలో గల స్థలాన్ని కొంతమంది ఆక్రమించి బడ్డీలు, కిరాణా షాపులు ఏర్పాటు చేశారు. దీంతో మార్కెట్ యార్డులోకి వెళ్లడానికే అవకాశం లేకుండా పోయింది. దీంతో మార్కెట్ కమిటీ పాలకవర్గం ఇటీవల ఆక్రమణలు తొలగించి చెత్తా చెదారాలను ఇతర ప్రాంతానికి తరలించారు. కాగా ప్రస్తుతం అక్కడ ఇంటి నిర్మాణ వ్యర్థాలు, మార్కెట్‌లో వ్యర్థాలను కొంత మంది ఇక్కడ గుట్టలుగా వేస్తున్నారు. దీని వలన అపారిశుద్యం నెలకుంటోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యర్థాలు, చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో కారు డ్రైవర్ దుర్మరణం



మృతుడు రాముడు (ఫైల్)

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు బ్యాంకు కాలనీలోని అనిల్ ప్రసాద్ రిసార్ట్స్‌లో విద్యుదాఘాతంతో ధర్మవరపు రాముడు (29) అనే కారు డ్రైవర్ బుధవారం దుర్మరణం చెందాడు. భీమిలి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళంల జిల్లా అజ్జారం గ్రామానికి చెందిన మృతుడు నగరంలోని దొండపర్తిలో ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతని స్నేహితుడు దాసు పుట్టినరోజు వేడుకలు జరుపుకునేందుకు బుధవారం ఉదయం 10.30 సమయంలో 13 మంది స్నేహితులతో కలిసి రిసార్ట్స్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మృతుడు స్విమ్మింగ్‌పూల్‌లో దిగి ఒడ్డుకు చేరిన తర్వాత అక్కడే ఉన్న విద్యుత్ స్తంభాన్ని తాకడంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతన్ని రక్షించడానికి మరో స్నేహితుడు పెదగాడి అనిల్ ప్రయత్నించగా అతనికి కూడా స్వల్పంగా విద్యుత్‌షాక్ తగలడంతో దూరంగా పడిపోయాడు. మిగిలిన స్నేహితులు రాముడును సంగివలస అనిల్ నీరుకొండ జనరల్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధృవీకరించారు. మృతుని తండ్రి అప్పన్న ఫిర్యాదు మేరకు భీమిలి ఎస్ఐ భరత్‌కుమార్ రాజు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వార్డు ఎన్నికలకు నామినేషన్ల వెల్లువ



వెల్లంకి వార్డు మెంబర్ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న వసి ఆదిలక్ష్మి



లక్ష్మీపురం సర్పంచ్ స్థానానికి నామినేషన్ దాఖలు చేస్తున్న అప్పలరాజు

ఆనందపురం : మండలంలోని వివిధ పంచాయతీల్లో ఖాళీ అయిన నాలుగు పంచాయతీ వార్డు స్థానాలకు పోటీ చేయడానికి ఐదుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఈ మేరకు ఎంపీడీవో అడపా లవరాజు నామినేషన్లు స్వీకరించారు. వెల్లంకి పంచాయతీ 6వ వార్డు (ఎస్సీ మహిళ) స్థానానికి వసి ఆదిలక్ష్మి, ఇదే పంచాయతీ 12 వార్డు (జనరల్) స్థానానికి సాడి బంగారమ్మ, గొలగాని రాము, కణమాం పంచాయతీ 3వ వార్డు (ఎస్సీ మహిళ) స్థానానికి ఎరుకొండ కృష్ణకుమారి, పాలవలస 1వ వార్డు (బీసీ మహిళ) స్థానానికి నిమ్మల లక్ష్మి నామినేషన్లు దాఖలు చేశారు. అందులో వెల్లంకి 6వ వార్డు, కణమాం 3వ వార్డు, పాలవలస 1వ వార్డుకి ఒక్కొక్క నామినేషను దాఖలు కావడంతో వారి ఎన్నిక లాంఛనమే కానుంది. ఈ నెల 14న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుంది. పోటీ ఉంటే ఈ నెల 19న ఎన్నిక నిర్వహిస్తారు.

ఏడు నామినేషన్లు దాఖలు

పద్మనాభం : మండలంలోని మూడు పంచాయతీలకు ఈ నెల 19న జరగనున్న మూడు వార్డు మెంబర్ల ఉప ఎన్నికకు గురువారం ఏడు నామినేషన్లు దాఖలైనట్టు రిటర్నింగ్ ఆఫీసర్ అరసాడ రఘుపతిరావు తెలిపారు. రెడ్డిపల్లి తొమ్మిదో వార్డుకు మూడు, చిన్నాపురం రెండో వార్డుకు ఒకటి, బాందేవుపురం పదో వార్డుకు మూడు నామినేషన్లు దాఖలైనట్టు ఆయన తెలిపారు.

సర్పంచ్ స్థానానికి మరో నాలుగు నామినేషన్లు..

తగరపువలస: భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ స్థానానికి మరో నలుగురు అభ్యర్థులు దాఖలు చేశారు. వారిలో టీడీపీ బలపరిచిన బోని రమణ, కనకల సత్యనారాయణ, జనసేన బలపరిచిన కరుభుక్త చందు, ఇండిపెండెంట్ అభ్యర్థి కరుభుక్త అప్పలరాజు ఉన్నారు. పంచాయతీలో లచ్చుబుగత రామారావు ఇటీవల మృతి చెందడంతో ఏర్పడిన ఖాళీకి ఈ నెల 19న ఎన్నిక జరగనుంది. ఇదిలా ఉండగా వైఎస్సార్‌సీపీ బలపరిచిన దివంగత సర్పంచ్ లచ్చుబుగత రామారావు కుమారుడు జగదీశ్వరరావును ఏకగ్రీవంగా సర్పంచ్ అయ్యేలా పంచాయతీకి చెందిన అన్నివర్గాల పెద్దలు తీవ్రంగా కృషి చేస్తున్నారు.

- భీమిలి మండలం టి.నగరపాలెం 10వ వార్డు సభ్యునిగా ఇండిపెండెంట్ అభ్యర్థి పూసర్ల రామారావు ఒక్కడే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నిక యినట్టయింది.



పూసర్ల రామారావు

తాగునీటి సమస్యకు పరిష్కారం

ఒకటో వార్డుకు 3 బోర్లు మంజూరు



షాదీఖానా వద్ద బోరుబావికి భూమిపూజ చేస్తున్న రామునాయుడు

తగరపువలస: భీమిలి జోన్ ఒకటోవార్డులో తాగునీటి సమస్య పరిష్కారానికి మూడు బోరుబావులను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మంజూరు చేశారని తగరపువలస పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు తెలిపారు. బంగ్లామెట్ట షాదీఖానా వద్ద బోరుబావి నిర్మాణానికి గురువారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ మాజీ కౌన్సిలర్ ఎల్లపు సత్యారావు ఇంటి వద్ద, హరిజన సంతపేటలోని మరో మాజీ కౌన్సిలర్ జీవీ రమణ ఇంటి వద్ద మరో బోరుబావి ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకుడు బాబ్జీ, వైఎస్సార్‌సీపీ నాయకులు తమ్మిన కూర్మారావు, తమ్మిన నరసింగరావు, వెంపాడ వెంకటరమణ, సోమి అప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవి గద్దర్‌కు ఘన నివాళులు



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

భీమునిపట్నం: ప్రజాకవి గద్దర్‌కు స్థానిక దళిత సంఘాల నేతలు గురువారం ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాల మహానాడు కార్యదర్శి భాగం గోపాలరావు మాట్లాడుతూ గద్దర్ పేద, బడుగు, బలహీన వర్గాల వారి అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటాలు చేసిన మహానుభావుడన్నారు. సుమారు 20 సంవత్సరాల క్రితం మండలంలోని మజ్జివలస గ్రామంలో జరిగిన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు వచ్చారని, ఆ సమయంలో ఆయన ప్రసంగం, పాటలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయని అన్నారు. గద్దర్ లేకపోయినా, ఆయన చేసిన పోరాటాలు మరువలేమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కులవివక్ష పోరాట సమితి ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి, దళిత నాయకులు పారుపల్లి నర్సింగరావు, మామిడి శివ, కింతాడ అప్పలరాజు, తెరుకోటి లక్ష్మి, గౌరి పాల్గొన్నారు.